## క్లుప్తంగా

### ఏఎంసీ చైర్మన్ల నియామకం





పురం రామ్మూర్తి మాలతి చంద్రమౌళి

**పీలేరు రూరల్ :** నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లుగా పీలేరుకు పురం రామ్మూర్తి, కలికిరికి మాలతి, వాల్మీకిపురంకు చంద్రమౌలిని నియమిస్తూ టీడీపీ అధిష్టానం ఉత్వర్వులు జారీ చేసింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 47 మందితో ఏఎంసీ చైర్మన్ల జాబితా విడుదల చేసింది. ఇందులో భాగంగా ఏఎంసీ పదవులు పురం రామ్మూర్తి, మాలతి, చంద్రమౌలిలకు వరించాయి.

### బీసీలు ఐక్యత చాటాలి



మాట్లాడుతున్న జన్నే రాజుంద్రనాయుడు

**మదనపల్లె సిటీ :** బీసీలు ఐక్యమత్యం చాటాలని బీసీ సంఘం నాయకులు, రాష్ట్ర పాల ఏకరి సేవా సమితి అధ్యక్షులు జన్నే రాజేంద్రనాయుడు అన్నారు. స్థానిక గొల్లపల్లి వద్దనున్న ఓ ఫంక్షన్ హాలులో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీసీల సమస్యలపై అందరూ ఏకతాటిగా పోరాటాలు చేయాలన్నారు. బీసీలు ఏ పార్టీలో ఉన్నా అండగా నిలవాలన్నారు. అన్యాయం జరిగితే అందరూ ముందుకు రావాలన్నారు. జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు సుబ్రమణ్యం, పొదల నరసింహులు, కట్ట గంగులప్ప, నాగరాజ, బండి ఆనంద్, కిష్టప్ప, ఈశ్వరయ్య, సురేంద్ర, సహజీవన్‌బాబు, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

### నూతనకాల్వ పంచాయతీకి రూ. 5.01 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్

**కేవీపల్లె :** వారపుసంత వేలం ద్వారా మండలంలోని నూతనకాల్వ పంచాయతీకి రూ. 5.01 లక్షల ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం నూతనకాల్వ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వెంకటమ్మ అధ్యక్షతన నూతనకాల్వ వారపు సంత గేటు వసూలు హక్కు కోసం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దేవేంద్రరెడ్డి హెచ్చుపాట ద్వారా రూ. 5.01 లక్షలకు దక్కించుకున్నట్లు ఈవోపీఆర్‌డీ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ సేవలకు గుర్తింపుగా డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మునిగోపాలకృష్ణ

**మదనపల్లె సిటీ :** సీనియర్ సిటిజెన్స్‌కు ఉత్తమ సేవలను అందించినందుకు గుర్తింపుగా ఢిల్లీకి చెందిన డే స్ప్రింగ్ ఇంటర్‌నేషనల్ యూనివర్సిటీ మదనపల్లెకు చెందిన సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు మునిగోపాలకృష్ణకు డాక్టరేట్ ప్రదానం చేసింది. శుక్రవారం హైదరాబాదులోని బిర్లా ప్లానిటోరియంలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ జేమ్స్ డాక్టరేట్ అందజేశారు. ఆయన్ను సీనియర్ సిజిజెన్స్ అభినందించారు.

### జాబ్‌మేళాలో ఏడుగురు ఎంపిక

**తంబళ్లపల్లె :** స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో ఏడుగురు ఎంపికైనట్లు ఏపీఎస్ఎస్‌డీ స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య తెలిపారు. ప్రతి నెలా ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమలో టీఓ నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

### వారపు సంత వేలం

**ములకలచెరువు :** ములకలచెరువు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వారపు సంతకు నిర్వహించిన వేలంలో రూ. 4,07,000 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. సర్పంచ్ రహమత్‌బీ ఆధ్వర్యంలో కార్యదర్శి ఆజాద్ వేలం నిర్వహించారు. ములకలచెరువుకు చెందిన బి. రామాంజులు వేలం దక్కించుకున్నాడు. ఈ మొత్తాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తామని కార్యదర్శి పేర్కొన్నారు.

# ఖురాన్ బోధనలు మానవాళికి ఆదర్శం

**షబేఖదర్ ప్రత్యేక ప్రార్థనల్లో సర్‌ఖాజీ జలాలుద్దీన్**



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

**మదనపల్లె సిటీ :** దివ్యఖురాన్ బోధనలు మానవాళికి ఆదర్శమని సర్‌ఖాజీ మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్ అన్నారు. రంజాన్ మాసంలోని 27వ రాత్రిని పురస్కరించుకుని ముస్లిం సోదరులు షబేఖదర్ పర్వదినాన్ని గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని జామియా మసీదు, మోతీ మసీదు, మక్కా మసీదు, మదీనా మసీదు,ఉస్మానియా మసీదు, మహమ్మదీయ మసీదులతో పాటు రూరల్ పరిధిలోని ఆరోగ్యవరం, సీటీఎం, బండికిందపల్లెలోని మసీదుల్లో షబే ఖదర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక జామియా మసీదులోల ప్రభుత్వ సర్‌ఖాజీ మౌలానా జలాలుద్దీన్ ధార్మికోపన్యాసం చేశారు. దివ్యఖురాన్ అవతరించిన మహోన్నత రేయి షబేఖదర్ అన్నారు. దివ్యఖురాన్ బోధనల ప్రకారం అందరూ నడుచుకుని ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. ముఖ్యంగా పవిత్ర రంజాన్‌మాసంలో ఫిత్రా,జకాత్ రూపంలో పేదలను ఆదుకోవాలన్నారు. షబేఖదర్ సందర్భంగా మసీదులన్నీ విద్యుత్‌దీపాలకాంతుల్లో ధగధగలాడాయి. ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కన్పించింది. రాత్రంతా మసీదు ప్రాంగణంలో ముస్లిం సోదరులు పూర్తిగా అధ్యాత్మిక చింతనతో గడిపారు. వేకువజామున ఖబరస్తాన్ వెళ్లి పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు.

**భక్తిశ్రద్ధలతో జుమతుల్ విదా:**
రంజాన్ మాసంలోని చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులు కన్నీటి పర్యంతమై ప్రత్యేక దువా చేశారు. రంజాన్ మాసాన్ని వీడ్కోలు పలుకుతూ ఈ మాసంలో మిగిలి ఉన్న రోజుల్లో చేయాల్సిన కార్యక్రమాలు, ధాన,ధర్మాల గురించి వివరించారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని జుమా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ మాసం చివరి శుక్రవారం కావడంతో మసీదులన్నీ ఉపవాస దీక్షపరులతో కిటకిటలాడాయి.

# కూటమి ప్రభుత్వంలో విద్యుత్ పేరుతో నిలువు దోపిడీ

**స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని సీపీఎం నిరసన**



విద్యుత్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

**మదనపల్లె :** గత ప్రభుత్వంలో విద్యుత్ ధరలు అధికంగా ఉన్నాయని గగ్గోలు పెట్టిన అప్పటి ప్రతిపక్షం, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో..అప్పటికంటే ప్రజలను నిలువునా దోపిడీకి గురిచేస్తూ షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ట్రూ అప్ సర్దుబాటు, ఇతర సుంకాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మదనపల్లె ఏపీఎస్పీడీఎస్ఎల్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ట్రూ అప్ చార్జీలను రద్దు చెయ్యాలి, సర్దుబాటు చార్జీలను రద్దు చెయ్యాలి, సెకీ ఒప్పందాలను రద్దు చెయ్యాలి, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ...స్మార్ట్ మీటర్లను పెడితే పగలగొడతానని ఎన్నికలకు ముందు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చెప్పారని, గెలిచిన తర్వాత ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే, టీడీపీ అధికారంలోకి వస్తే తగ్గిస్తామని చెప్పిన మాటలకు పొంతన లేకుండా కూటమి నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. విద్యుత్ వాడిన బిల్లు కన్నా ఇతర చార్జీలే ఎక్కువగా ఉంటున్నాయని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ళ పాలనలో 35 వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీలు పెంచితే, కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల కాలంలోనే పదిహేను వేల కోట్ల రూపాయలు విద్యుత్ చార్జీలు పెంచారని విమర్శించారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టి.హరిశర్మ, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలరెడ్డిపల్లె కాలువ నిర్మాణానికి చర్యలు




తిరుమలరెడ్డిపల్లిలో కాలువ నిర్మాణానికి పరిశీలిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

**రామసముద్రం :** మండలంలోని పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో సీసీ రోడ్డు, మురుగుకాలవ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ భానుప్రసాద్, సర్పంచ్ రెడ్డెప్పనాయుడు తెలిపారు. శుక్రవారం వారు గ్రామంలో పర్యటించి కాలువలు లేక పోవడం వలన కలిగే ఇబ్బందులను పరిశీలించారు. తిరుమల రెడ్డిపల్లె గ్రామంలో కాలువ లేకపోవడంతో మురుగు వెళ్లేందుకు మార్గంలేక దుర్గంధంగా ఉందని గ్రామస్తులు ఎంపీడీఓకు విన్నవించారు. నీటి కాలువ లేకపోవడంతో ఇళ్లలోని మురుగు నీరు అంతా అక్కడే నిల్వ ఉండి దుర్వాసన వస్తోందన్నారు. కాలువలు నిర్మించేందుకు త్వరగా మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ సురేంద్ర బాబు, వడ్డెర చంద్రప్ప, అమర తదితరులు పాల్గొన్నారు.

# 34 నీటితొట్టెలు మంజూరు

**గుర్రంకొండ :** మండలానికి ఎన్‌ఆర్‌జీఎస్ పథకం కింద నూతనంగా 34 నీటి తొట్టెలు మంజూరు అయినట్లు ఏపీవో జయరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వేసవి కాలంలో పశువుల దాహార్తి తీర్చడానికి మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు 34 నీటితొట్టెలు మంజూరు అయ్యాయని అన్నారు. ఒక్కో నీటితొట్టె నిర్మాణానికి రూ. 32 వేలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. పంచాయతీల పరిధిలో పశువులకు నీరుదొరకని ప్రాంతంలో వీటిని నిర్మించాలన్నారు. నీటి తొట్టెలు నిర్మించే ప్రదేశంలో పంచాయతీ నీటి ట్యాంకుగానీ, పంచాయతీ నీటికొళాయి కనెక్షన్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేని పక్షంలో ఎవరైనా రైతు తనబోరు నుంచి ఉచితంగా నీటి సరఫరా ఇస్తామనే ప్రదేశంలో నీటి తొట్టెలు నిర్మించాలన్నారు. త్వరలోనే ఉపాధిహామీ కూలీల చేత నీటి తొట్టెల నిర్మాణం చేయించే బాధ్యత ఫీల్డ్‌అసిస్టెంట్లపై ఉందన్నారు. గతంలో మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న నీటితొట్టెలను ఫీల్డ్‌అసిస్టెంట్లు గుర్తించి వాటిని వినియోగంలోకి తేవాలన్నారు. గతంలో నిర్మించి నిరుపయోగంగా నీటితొట్టెలు ఉన్న గ్రామాల్లో కొత్తవి నిర్మించకూడదన్నారు.

# భూసార పరీక్షతో అధిక దిగుబడి



భూసార పరీక్షల పత్రాలను అందజేస్తున్న చంద్రా నాయక్

**కురబలకోట :** భూసార పరీక్షతో పంట దిగుబడి సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని చింత మాకులపల్లెలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో అధిక దిగుబడి రావాలంటే భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయాలన్నారు. అధిక దిగుబడి పొందాలన్నా, రసాయనిక ఎరువులు తగ్గించాలన్నా ముందుగా భూసార పరీక్షలు చేయాలన్నారు. ఎంత మోతాదులో ఎరువులు వాడాలన్నది భూసార పరీక్షల ద్వారా తెలిసి వస్తుందన్నారు. ఏ పంట పండించాలన్నా ముఖ్యంగా భూమి, విత్తనం, నీరు అవసరమన్నారు. ముందుగా భూమి గుణగుణాలు తెలుసుకుని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడికి ఆస్కారం ఉందన్నారు. ఏఓ రాధ, స్వాతి, రాధ, ఖాన్, కల్పన, రైతులు శివారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్వో సేవలు ఆదర్శనీయం



వీఆర్వో ఇబ్రహీంసాహెబ్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**పీలేరు రూరల్ :** పదవీ విరమణ పొందిన వీఆర్వో షేక్ ఇబ్రహీంసాహెబ్ సేవలు అభినందనీయమని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక హుమయూన్ కళ్యాణ మండపంలో వీఆర్వో షేక్ ఇబ్రహీంసాహెబ్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వీఆర్వో దంపతులను పూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం ఆయన శేష జీవితం సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీటీలు చంద్రశేఖర్, సుబ్రమణ్యం, వీఆర్వోలు హేమంత్ నాయక్, యల్లయ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

**పీలేరురూరల్ :** ప్రయాణికుల సమస్యలపై శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం బి. నిర్మల తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు పీలేరు డిపో పరిధిలో ఏవైనా సమస్యలుంటే పరిష్కారం కోసం 99592 25679 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

### పదో తరగతి పరీక్షలకు పదిమంది గైర్హాజరు

**కలకడ :** మండలంలోని మూడు కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన 10వతరగతి బయాలజీ పరీక్షకు 10 మంది విద్యార్థులు గైహాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. కలకడ ఉన్నత పాఠశాలలో 199 మందిని కేటాయించగా 197 మంది హాజరయ్యారు. కలకడ ఆదర్శ పాఠశాలలో192 మందికి 189మంది, కోన ఉన్నతపాఠశాలలో 58 మందికి 53 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకూ 144సెక్షన్‌ను పోలీసులు అమలు చేశారు.

### నర్సింగ్ సిబ్బంది డిప్యుటేషన్ పొడిగింపు

**మదనపల్లె :** ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న నర్సింగ్ సిబ్బంది డిప్యుటేషన్ మరో ఏడాది పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇటీవల బదిలీల ఆప్షన్లు కోరుకోవాలంటూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో...ఆస్పత్రిలో వైద్యసేవలకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో నర్సింగ్ సిబ్బందిని యథావిధిగా మరో ఏడాదిపాటు విధుల్లో కొనసాగించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 26 మందికి డిప్యుటేషన్ ఉత్తర్వులు రాగా, అందులో నర్సింగ్ సూపరింటెండెంట్ నాగశ్రీ, నలుగురు హెడ్‌నర్సులు, 19 మంది స్టాఫ్ నర్సులు, 1 సీనియర్ అసిస్టెంట్, 1 జూనియర్ అసిస్టెంట్‌లకు సర్వీసు పొడిగించారు.

### నేడు టౌన్‌బ్యాంక్ సాధారణ మహాజనసభ సమావేశం

**మదనపల్లె :** ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సాధారణ మహాజన సభ సమావేశం శనివారం పట్టణంలోని బుగ్గకాలువ ఎన్.వీ.ఆర్.కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం టౌన్‌బ్యాంక్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... సాధారణ మహాజనసభ మీటింగ్‌కు ఏ తరగతి సభ్యులు హాజరుకావాల్సిందిగా కోరారు. సమావేశంలో బ్యాంకు ఆర్థిక ప్రగతిని సమీక్షించడంతో పాటు పలు కీలక అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులందరూ సమావేశానికి తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### చలివేంద్రం ప్రారంభం

**ములకలచెరువు:** స్థానిక మండల కేంద్రంలో ఆటోయూనియన్ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. యూనియన్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు.

# నేటి నుంచి చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తొగటవీరక్షత్రియ సంఘ నాయకులు

**మదనపల్లె సిటీ :** మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభంకానున్నట్లు తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షులు ఉప్పు చంద్రశేఖర్, కార్యదర్శి పవన్‌కుమార్, కార్యదర్శి పవన్‌కుమార తెలిపారు. శుక్రవారం స్థానిక చౌడేశ్వరి ఆలయంలో జ్యోతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లాలోనే అత్యంత వైభవంగా జ్యోతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29వ తేదీన గణపతిహోమం, చౌడేశ్వరిదేదవి, సుబ్రమణ్యంస్వామి వెండి అలంకారంలో దర్శనమిస్తారన్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటలకు జ్యోతుల(దీలు మోయుట) తో అమ్మవారి ఆలయంలో పూజలు జరుగుతాయన్నారు. 30న ఉదయం జ్యోతులు తయారు చేయుట,రాత్రి అమ్మవారిని అలంకరించి సింహవాహనంపై పుష్పపల్లకిలో ఊరేగింపు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం, జ్యోతి ఉత్సవాలు జరుగుతాయన్నారు. 31న తొగటవీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు, సాయంత్రం ఉట్ల తిరునాల, పగలు తిరునాల అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. ఏప్రిల్ 1వతేదీన ఉదయం జ్యోతిప్రసాదాల వినియోగం, సాయంత్రం అమ్మవారి లడ్డు, విలువైన చీరలు, జ్యోతి నాణెములు వేలం వేయబడుతుందన్నారు. అమ్మవారి రథం ముందు జంతుబలి చేయరాదన్నారు. ఉత్సవాలకు భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు మోడం వెంకటరమణ,ఉపాధ్యక్షులు నీలకంఠ, సిద్దప్ప, లక్ష్మీనారాయణ, మోహన్, బండి నాగరాజ, శీలం రమేష్, కె.వి.నాగరాజ, చిన బాబు, ఉప్పు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ సంతోషంగా జరుపుకోవాలి

**వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్**



మహిళలకు రంజాన్ కానుక అందిస్తున్న నిసార్‌అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు

**మదనపల్లె :** రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి బి.రేవతి ఆధ్వర్యంలో పేద ముస్లిం మహిళలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు పాటిస్తున్న ముస్లిం కుటుంబాలకు రంజాన్ మాసం విశేషమైందన్నారు. నిరుపేద ముస్లిం కుటుంబాలకు తమ వంతు సహాయంగా సహకారం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి బి.రేవతి దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉండేవారన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు నిలిపివేయడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని, పండుగ పూట చేతిలో డబ్బులు లేక పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. పేదలను ఆదుకున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ఈ విషయం ప్రజలే స్వయంగా చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నీరుగట్టి మేరీ, ఎస్.ఏ.కరీముల్లా, మస్తాన్‌రెడ్డి, వలసపల్లె నాగరాజరెడ్డి, వేణుగోపాల్, రామిశెట్టి మధు, ఆర్టీఏ నూర్, కొత్తపల్లెమహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అమరనాథరెడ్డి



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

**మదనపల్లె :** మదనపల్లెలో శుక్రవారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బి.అమరనాథరెడ్డి, జనరల్ సెక్రటరీగా జి.మనోహర గెలుపొందారు. ఎన్నికల అధికారి జి.మునిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో సభ్యులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 243 మంది సభ్యులకుగాను, 128 మంది ఎన్నికల్లో ఓటువేశారు. సాయంత్రం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో అమరనాథరెడ్డి 21 ఓట్ల మెజారిటీతో అధ్యక్ష స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జనరల్ సెక్రటరీ జి.మనోహర 6 ఓట్ల మెజారిటీతో, వైస్ ప్రెసిడెంట్ ఏ.వి.శివకుమార్‌రెడ్డి 76 ఓట్ల మెజారిటీతో, మహిళా రెప్రజెంటేటివ్ ఏ.సుజాత 7 ఓట్లతో, 12వ ఈసీ మెంబర్ జే.ఎస్.యశ్వంత్‌కృష్ణ 115 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో జాయింట్ సెక్రటరీగా కే.సోమశేఖర్, ట్రెజరర్ అహ్మద్ నజీరుద్దీన్‌షేక్, లైబ్రరీ సెక్రటరీ ఎస్.రెడ్డినాగులు, ఈసీ మెంబర్లుగా ఎస్.విజయ్‌కుమార్, ఎస్.ప్రతాప్‌రెడ్డి, ఏ.శైలజ, కంబగిరి సంపత్, జి.దినేష్‌కుమార్‌రెడ్డి, పీ.వి.ప్రసాద్, మునగర వంశీవర్ధన్, ఎస్.పర్వేజ్‌అహ్మద్, జీఎస్.సురేష్‌బాబు, సీహెచ్.శివశంకర్, కేఎం.కరమతుల్లా ఎన్నికయ్యారు.

# ఉడ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ఉడ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు

**మదనపల్లె :** ఆల్ ఇండియా ఉడ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సీనియర్స్, జూనియర్స్ టోర్నమెంట్‌లో శ్రీ జ్ఞానాంబిక కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో రన్నర్‌అప్‌గా నిలిచారని కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. శుక్రవారం జాతీయస్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహారాష్ట్రలోని నాగపూర్ స్టేడియంలో మార్చి 23 నుంచి 26 వరకు నిర్వహించిన ఆల్‌ఇండియా ఉడ్‌బాల్ టోర్నమెంట్‌లో 28 రాష్ట్రాల నుంచి పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున తమ కళాశాల నుంచి నలుగురు పురుషులు, నలుగురు మహిళలు జాతీయస్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. పోటీల్లో మహారాష్ట్ర జట్టు విజేతగా, ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నర్ అప్‌గా నిలిచాయన్నారు. ఆల్‌ఇండియా ఉడ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు అభిషిత్ దేశ్‌ముఖ్ చేతుల మీదుగా తమ విద్యార్థులు రన్నర్ అప్ షీల్డ్ అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రిన్సిపాల్ సురభిరమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్‌లు అభినందించారు.

# వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం నాయకులు

**పీలేరు :** వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని పీలేరు ముస్లిం మత పెద్దలు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలోని అన్ని మసీదుల వద్ద ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింల హక్కులకు తీవ్ర నష్టం కలగనుందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ఇది ప్రమాదకరమని, ఆస్తులు ముస్లిం సమాజానికి చెందని, వాటిపై ఏ విధమైన ప్రభుత్వ జోక్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో ముస్లిం మైనారిటీ హక్కులు హరించి పోతాయన్నారు. కార్యక్రమంలో జామియా మస్‌జిద్ ముతవల్లి అల్లా ఉద్దీన్, హజరత్ ముక్తి, అబ్దుల్లా, షేక్ షాకీర్, ఆబిద్, ఉబేదుల్లా, దావుద్, ఖాజా, ముస్లిం యువత, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్ కార్మికుల పక్షపాతి

- ఘనంగా వైఎస్సార్ టీయూసీ ఆవిర్భావ వేడుకలు
- పార్టీ జెండా ఆవిష్కరించిన సమన్వయకర్త నిసార్‌అహ్మద్
- కార్మిక సంక్షేమాన్ని విస్మరించిన కూటమిప్రభుత్వం



వైఎస్సార్‌సీపీ టీయూసీ జెండా ఆవిష్కరించిన నిసార్‌అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు

**మదనపల్లె :** వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మిక పక్షపాతి అని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ కార్పొరేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు వేణుగోపాల్‌తో కలిసి వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరంచారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేసిందన్నారు. రాష్ట్రంలో కార్మికులు వారి హక్కుల కోసం ఎలాంటి ఉద్యమాలు చేయాల్సిన పనిలేకుండా నాటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆటో, చేనేత, నాయీబ్రాహ్మణ, పారిశుధ్య కార్మికులతో పాటు అన్నిరంగాల కార్మికులకు అండగా నిలిచారన్నారు. కార్మికుల అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు మంచి చేశారన్నారు. కార్మికుల స్థితిగతులు బాగుపడాలన్న లక్ష్యంతో వైఎస్.జగన్ చట్టాలను సక్రమంగా అమలుచేశారన్నారు. ఆప్కాస్ అనే పదాన్ని తీసుకువచ్చిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన సంవత్సరంలో 1,30,000 మందికి శాశ్వత ఉద్యోగాలు కల్పించడంతో పాటు 4 లక్షల మంది వలంటీర్లను నియమించారన్నారు. గత ప్రభుత్వంలో కార్మికులకు ఏ కష్టం వచ్చినా వైయస్.జగన్ అండగా నిలిచారన్నారు. ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఏటా రూ.10వేలు ఇచ్చి ఆదుకున్నారన్నారు. కోవిడ్ సమయంలో కార్మికులకు అండగా ఉండటంతో పాటు.. తోపుడుబండ్లు, వీధివర్తకులు, టైలర్లకు ఆర్థికసహాయం అందించడమే కాకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. వైఎస్.జగన్ కార్మికులను, ఉద్యోగులను ఏనాడు ఇబ్బంది పెట్టలేదన్నారు. కూటమినేతలు కార్మికసంక్షేమాన్ని విస్మరించారని, వారికి పథకాలు అందించడంలో సర్కారు విఫలమైందన్నారు. రాష్ట్రంలోని కార్మికులకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏ.కరీముల్లా, మహిళా కార్యదర్శి బి.రేవతి, మునిశేఖర్, వలసపల్లె నాగరాజరెడ్డి, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లె హబీబ్, వైజయంతి, నీరుగట్టిమేరీ, అపర్ణ, రోలింగ్‌మల్లిక, ఆర్టీఏ నూర్, పూజారిచరణ్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.